క్లుప్తంగా

ఉరుకుందలో భక్తుల సందడి


ఈరన్నస్వామి

కౌతాళం: మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలిరావడంతో సందడి నెలకొంది. భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారు జామున సుప్రభాతసేవ, మహామంగళహారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించి ఫలపుష్పాలతో అలంకరించారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు. కొందరు భక్తులు ఆలయ ఆవరణలో పిండి వంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.

శివస్వాముల శోభాయాత్ర


శివుడిని పల్లకీలో ఊరేగిస్తున్న శివస్వాములు

ఆదోని రూరల్: మండల పరిధిలోని పెద్దహరివాణం గ్రామంలో శివ దీక్ష స్వాములు సోమవారం శోభాయాత్ర నిర్వహించారు. ప్రతి ఏటా మహాశివరాత్రిని పురస్కరించుకొని మందస్తుగా గ్రామం పురవీధుల్లో శివస్వాములు ఆధ్వర్యంలో శివుని చిత్ర పటంతో శోభాయాత్ర నిర్వహించడం ఆనవాయితీ. స్థానిక శివ సాయి గణేష్ దేవాలయం నుంచి వాహనంపై శివ చిత్ర పటాన్ని ఊరేగిస్తూ శివదీక్ష స్వాములు, గొరవయ్య నృత్యాలు చేశారు. విజేత స్కూల్ విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంప్రదాయ గీతాలకు నృత్యాలు, భజనలు చేస్తూ భక్తి గీతాలను ఆలపిస్తూ ముందుకు సాగారు.

టీబీపై అవగాహన కల్పించాలి


మాట్లాడుతున్న డాక్టర్ అనిల్ సాగర్

ఆదోని టౌన్: టీబీపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ షేకున్ బాను, డాక్టర్ షేహెన్ బేగమ్, డాక్టర్ అనిల్ సాగర్, డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని అరుంధతి నగర్, హనుమాన్ నగర్, బార్‌పేటలో అర్బన్ పీహెచ్‌సీల్లో ఏఎన్‌ఎం, ఆశా వర్కర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వ్యాధి నిర్ధారణ కోసం ఏరియా ఆసుపత్రిలోని టీబీ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. వ్యాధి నిర్ధారణ కోసం ఉచితంగానే పరీక్షలను చేస్తామన్నారు. ఒక వేళ నిర్ధారణ అయితే మందులు కూడా ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ బాబురాజు సిబ్బంది సుబ్బమ్మ బాయి. లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రగా శ్రీశైలానికి శివ స్వాములు


గోనెగండ్ల నుంచి శ్రీశైలానికి పాదయాత్రగా వెళ్తున్న శివ స్వాములు

గోనెగండ్ల : మండల కేంద్రం గోనెగండ్ల నుంచి శివ స్వాములు శ్రీశైలానికి పాదయాత్రగా సోమవారం ఉదయం బయలు దేరారు. సోమవారం స్థానిక ఈశ్వర దేవాలయంలో వీరశైవ మఠం పీఠాధిపతి శివయ్యస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అంతకు ముందు తెల్లవారు జాము నుంచే భక్తులు పెద్దసంఖ్యలో దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గురుస్వామి శివయ్యస్వామిచే ఇరుముడి కట్టించుకొని శివస్వాములు శ్రీశైలం బయలు దేరారు.

వ్యక్తిపై కేసు నమోదు

ఆదోని అర్బన్: భార్యభర్తలు గొడవ పడుతుండగా సమాచారం అందుకొని ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులపై బోయగేరికి చెందిన కిశోర్ దాడి చేశాడు. పోలీసులపై దాడి చేసినందుకు బోయగేరి కిశోర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీరామ్ సోమవారం తెలిపారు.

కొత్త బస్సు సర్వీసులు ప్రారంభం


కొత్త బస్సు సర్వీసును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఆర్టీసీ డిపోలో కొత్తగా బళ్లారి – బెంగళూరు బస్సు సర్వీసులను సోమవారం రాత్రి ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ మద్దిలేటినాయుడు తదితరులు పాల్గొన్నారు. అంతకుమునుపు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పలు ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

కుష్టు.. నిర్లక్ష్యం వద్దు

- చాపకింద నీరులా వ్యాపిస్తున్న కుష్టు వ్యాధి
- ఆదోని, ఎమ్మిగనూరులో కొత్తగా 18 కేసుల గుర్తింపు
- వైద్యశాలలో ఉచితంగా వైద్యం
- చికిత్స తీసుకుంటే పూర్తిగా నయమవుతుందంటున్న వైద్యులు


వ్యాధిపై ఆశావర్కర్లకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ షేహనాజ్ బేగం


ఇంటింటా సర్వే చేస్తున్న వైద్యాధికారులు

ఆదోని సెంట్రల్: కుష్టు వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటా సర్వే చేసి వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. కాగా, సర్వేలో కొత్త కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది. నిర్ధారణ అయినవారికి ఆధునిక పద్ధతుల్లో ప్రభుత్వ వైద్యశాలల్లో వారికి ఉచిత వైద్యం అందిస్తున్నారు. వ్యాధిపై నిర్లక్ష్యం చేయకుండా చికిత్స తీసుకుంటే వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చని వైద్యులు చెపుతున్నారు.

కొత్త కేసుల నమోదు

జాతీయ కుష్టు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా జనవరి 20 నుంచి జిల్లాలో ఇంటింటా సర్వే కార్యక్రమం చేపట్టారు. వైద్యులతో పాటు ఆశ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇతరత్రా సిబ్బంది ఆదోనిలో 124 మంది, ఎమ్మిగనూరులో 64 మంది ఇంటింటా సర్వే చేసి కుష్టు వ్యాధి గ్రస్తులను గుర్తిస్తున్నారు. ఆదోనిలో పాత కేసులు 16 ఉండగా కొత్తవి 9 కేసులను, ఎమ్మిగనూర్‌లో పాతవి 18 కేసులు ఉండగా కొత్తవి మరో 9 కేసులను గుర్తించారు.

లక్షణాలు..

వ్యాధి మైకో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వలన వ్యాప్తి చెందుతుంది. ఈ వ్యాధి చర్మానికి, నరాలకు పాకుతుంది. ఈ వ్యాధి బారిన వారి శరీరంపై చిన్నవి లేదా పెద్ద మచ్చలు కనిపిస్తాయి. పాలిపోయిన రాగి లేదా ఎరుపు రంగులో ఉంటాయి. ఆ మచ్చలో ముఖ్యంగా స్పర్శ ఉండదు, నొప్పి తెలియదు. సకాలంలో చికిత్స పొందక పోతే కాళ్లు చేతులు నిస్సత్తువ ఏర్పడి వైకల్యానికి దారితీస్తుంది.

చికిత్స ఇలా..

కుష్టు వ్యాధులను రెండు రకాలుగా గుర్తించి చికిత్స అందిస్తారు. వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు కంటే ఎక్కువ ఉంటే వారిని మల్టీ బ్యాసిల్లరీగా అంటే అంటు వ్యాధి లక్షణాలుగా గుర్తిస్తారు. చికిత్స తీసుకొని కనీసం 12 నెలలు పాటు మందులను వాడుతూ ఉండాలి. ఒకటి కన్నా ఐదు మచ్చలు ఉంటే వారిని పాసీ బ్యాసిల్లరీగా.. వ్యాప్తి లేని లక్షణాలుగా గుర్తిస్తారు. వీరు 6 నెలలు పాటు చికిత్స తీసుకొని మందులను వాడుతూ ఉండాలి.

ముఖ్యంగా పాదాలు పొడిగా ఉన్నప్పుడు వంటనూనె లేదా వ్యాజిలైన్ పూసుకోవాలి. పాదాలకు సురక్షితమైన పాదరక్షలు ఉపయోగించుకోవాలి. కుష్టు వ్యాధి గ్రస్తుల పాదాలు గాని చేతులుగాని స్పర్శ లేని ప్రాంతాన్ని రోజు అరగంట పాటు నీటిలో ముంచి ఉంచాలి. గాయాలు ఏర్పడితే క్రమం తప్పకుండా సబ్బు నీటితో శుభ్రం చేసుకోవాలి.

ఎండీటీ చికిత్సతో వ్యాధి దూరం

అంగవైకల్యం వచ్చిన వారికి ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తారు. శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం వారికి 2 నెలలు పాటు రూ. 12వేల ఆర్థికసాయం కూడా ప్రభుత్వమే అందిస్తుంది. బహుళ ఔషధ చికిత్సతో కుష్టు వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చును. దాదపు రూ. 15వేల నుంచి 20వేల వరకు ఖర్చు అయ్యే మందులను ప్రభుత్వమే ఉచితంగా అందిస్తోంది. వ్యాధిపై అవగాహన కలిగి ఉండి డాక్టర్లను సంప్రదించి తగిన సలహాలు సూచనలను తీసుకొని మందులను వాడితే వ్యాధి నయం అవుతుంది.

ఆందోళన చెందవద్దు



కుష్టువ్యాధిపై ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదు. సమాజం ఏమి అనుకుంటాడో, ఏమోనని చాల మంది భయపడుతూ ఉన్నారు. చర్మవ్యాధులకు సంబంధించి ఏమైనా అనుమానాలు ఉంటే ఆరోగ్య కేంద్రంలోని వైద్యులను సంప్రదించాలి. వ్యాధిని పరీక్ష చేసి ఉచితంగా చికిత్స అందిస్తారు. డబ్ల్యూహెచ్‌ఓ వారు తయారు చేసిన మందులను ఉచితంగా అందిస్తారు. భయపడాల్సిన పని లేదు. డాక్టర్లు సలహాల మేరకు మందులను వాడితే పూర్తిగా నయం చేసుకోవచ్చు.

– సీతారాముడు, పారా మెడికల్ అధికారి లెప్రసీ

ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి


అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా చూడాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్‌ఎస్) నిర్వహించారు. అయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని అయా శాఖల అధికారులు సంబంధిత సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితిలోనూ బియాండ్ ఎస్‌ఎల్‌ఏలోకి వెళ్ల కుండా చూడాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరాజు, వేణు సూర్య, డీఎల్పీఓ నూర్జహాన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటీవ్ ఈఈ పద్మజ, డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డా.సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

పొదుపు మహిళల పిల్లలకు శిక్షణ

ఎమ్మిగనూరుటౌన్: పొదుపు గ్రూపు సభ్యుల కుటుంబంలో డిగ్రీ చదివిన పిల్లలకు మెప్మా, లైవ్లీ హుడ్ నుంచి వివిధ స్కీంల కింద శిక్షణ ఇప్పించి ఉపాధి చూపుతామని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సోమవారం తెలిపారు. పొదుపు గ్రూపుల్లో కల వారి కుటుంబ సభ్యులు 2021 ఏప్రిల్ నుంచి 2025 వరకు డిగ్రీ చదివిన విద్యార్థులకు ఆశ సొసైటీ ద్వారా అప్రెంటీస్ ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. అర్హులైన వారికి ఈడీపీ, ఎంప్లాయ్‌మెంటరీ స్కిల్స్, ఇంగ్లిష్ స్కిల్స్, లైఫ్ స్కిల్స్‌పై ఆన్‌లైన్‌లో శిక్షణ ఉంటుందన్నారు. ప్రతి రోజు శిక్షణలో పాల్గొన్న వారికి ప్రతి నెల రూ.4,500లు స్టైఫండ్ వస్తుందని చెప్పారు. ఇందులో ఆశా సొసైటీకి సర్వీస్ చార్జ్ కింద రూ.1000 పోను నెలకు రూ.3500ల చొప్పున 12నెలలకు రూ.42,000లు ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో ఉన్న మెప్మా విభాగంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు సీఎంఎం జయవర్ధన్, సెల్ నంబర్ 79016 10388, సీఓలు రియాజ్ బాషా 79016 10353, లలిత 79016 10376, డీఈఓ ప్రదీప్ సెల్ నంబర్ 790161 03384లకు సంప్రదించాలన్నారు.

ఫుట్‌బాల్ విజేత కర్నూలు జట్టు


గెలుపొందిన క్రీడాకారులకు నగదు, ట్రోఫీని అందజేస్తున్న ఎంసీఎస్ ఎఫ్‌సీ బృందం సభ్యులు

కోసిగి: మండల కేంద్రం కోసిగి మౌంట్ కార్మెల్ పాఠశాల గ్రౌండ్‌లో రేణుక ఎల్లమ్మ జాతరను పురస్కరించుకుని ఎంసీఎస్ ఎఫ్‌సీ క్రీడకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. సోమవారం కర్నూలు, కోసిగి జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఇందులో కోసిగి జట్టుపై కర్నూలు జట్టు విజేతగా నిలిచింది. గెలుపొందిన కర్నూలు జట్టుకు ప్రథమ బహుమతి రూ.30వేలు కోసిగి ప్రజల సహకారంతో, ద్వితీయ బహుమతి కోసిగి జట్టుకు రూ.20వేలు బుల్లి విజయ్ (బీవీ మెన్స్ వేర్), తృతీయ బహుమతి ఎమ్మిగనూరు జట్టుకు రూ.10వేలు (అమృత క్లినిక్ డాక్టర్ మల్లికార్జున) అందజేశారు. కార్యక్రమంలో ఆర్గనైజర్స్ ఆకాష్, సందీప్, ఆకీరాలు, క్రీడకారులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి



ఎమ్మిగనూరు ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

ఆదోని సెంట్రల్: కూటమి నాయకులు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటమ్మ, సీఐటీయూ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, గోపాల్ డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయలేక కాలయాపన చేస్తోందన్నారు. ప్రభుత్వం స్పందించి పెరిగిన ధరలకు అనుగుణంగా నెలకు రూ. 26వేల వేతనం పెంచాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకులు పద్మమ్మ, సరోజ, సోమక్క, రిజ్వానా, మీనాకుమారి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌డీలను చులకనగా చూస్తే ఉద్యమిస్తాం

ఎమ్మిగనూరురూరల్: కూటమి ప్రభుత్వం మా సమస్యలు పట్టించుకోకుండా చులకనగా చూస్తే ఉద్యమిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి గోవర్ధనమ్మ, అర్బన్ కార్యదర్శి నాగలక్ష్మి, రూరల్ కార్యదర్శి శైలజ, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు హెచ్చరించారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. కార్యాలయం నుంచి ర్యాలీగా సోమప్ప సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. యూనియన్ నాయకురాళ్లు నాగేశ్వరమ్మ, అరుణ, భాగ్యమ్మ, వరలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ 29వ వార్షికోత్సవం


కలశాలు, దీపాలతో రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


అలంకరణలో శారదా మాత

ఆదోని అర్బన్: స్థానిక తిరుమల నగర్‌లో వెలసిన శ్రీ శారద శంకరమఠంలో ఆలయ 29వ వార్షికోత్సవం ఘనంగా జరిగింది. నాగ గాయత్రీ దత్త పీఠం స్వామీజీ గరుడాద్రి దత్తాత్రేయ స్వామి ఆధ్వర్యంలో తొలిసారిగా రథోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకొని అమ్మవారికి 18 రకాల ద్రవ్యములతో, సరయు, తుంగభద్ర, కృష్ణ, గంగా, త్రివేణి సంగమ, పంపా నది తీర్థములతో అభిషేకం, లలిత హోమము, మేధా సూక్త హోమము రథాంగ హోమము నిర్వహించారు. బ్రాహ్మణుల వేద మంత్రముల మధ్య అభిజిత లగ్నములో బ్రహ్మ రథోత్సవం చేపట్టారు. రథం ముందు సౌందర్య లహరి మహిళా మండలి, వాసుదేవ మహిళా మండలి వారు లలితా పారాయణం చేశారు. అంబా భవాని డిండి భజన మండలి వారు పండరి భజన చేస్తూ ముందుకు సాగారు. కార్యక్రమానికి దేవాలయ ధర్మాధికారి డాక్టర్ హరీష్ కశ్యప్ గారు కాలనీ ప్రముఖులు విచ్చేశారు.

ఉఘో ఉఘో తాయి ఎల్లమ్మ!

- రమణీయంగా రేణుక ఎల్లమ్మ రథోత్సవం
- అమ్మవారి దర్శనార్థం పోటెత్తిన భక్తులు


కలశాన్ని ఊరేగింపుగా రథం వద్దకు తీసుకొస్తున్న దొర వంశస్తులు

కోసిగి: కోసిగి ప్రజల ఆరాధ్య దైవం, కొలిచే వారి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ రేణుక ఎల్లమ్మ దేవి మహా రథోత్సవం సోమవారం సాయంత్రం వేలాది మంది భక్తుల మధ్య రమణీయంగా సాగింది. వేకువ జామున అమ్మ వారికి విశేష పూజలు చేపట్టి మహామంగళ హారతులు గావించి భక్తులకు దర్శనం కల్పించారు. తెల్లవారుజామున నుంచే భక్తులు అమ్మ వారి దర్శనం కోసం క్యూ కట్టారు. కోసిగితో పాటు జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచే కాక కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్ర లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి అమ్మవారికి కుడుములు, గుగ్గిళ్ల నైవేద్యంగా సమర్పించారు. చర్మ వాధులు ఉన్న వారు మొక్కుబడిగా కేజీ పావు ఉప్పు అమ్మ వారికి సమర్పించి పూజలు చేసుకున్నారు.

సంప్రదాయ బద్ధంగా ఉత్సవం

సాయంత్రం సంప్రదాయ బద్ధంగా దివంగత మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ రాజు దొర ఇంటి నుంచి ఆయన వంశస్తులు శ్రీనివాస రాజు దొర, మురళీ దొర, సుందరరాజు దొర ఆధ్వర్యంలో పూర్ణకుంభాన్ని మేళాతాళాలు డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకుని రథానికి పూజలు చేశారు. అనంతరం అమ్మ వారి మూలవిరాట్‌ను మహారథంపై కొలువుంచి ఆలయం నుంచి మహారథోత్సవం భక్తుల మధ్య అమ్మవారి పాదాల చెంత వరకు లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. రథోత్సవంలో భక్తులు ఉఘో ఉఘో తాయి ఎల్లమ్మ అంటూ.. అమ్మవారి నామస్మరణ చేస్తూ అరటి పళ్లు విసిరి మొక్కులు చెల్లించారు.

రథోత్సవంలో ప్రముఖులు


అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు వై. ప్రదీప్ రెడ్డి

రథోత్సవానికి వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షులు వై. ప్రదీప్ రెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పి.మురళీ మోహన్ రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు. రథం వద్ద నారికేలల కొట్టి పూజలు చేశారు. వారికి ఆలయ అర్చకులు గౌరీష్ గౌడ అమ్మవారి ఫల, పుష్పా మంత్రాంక్షితలు, శాలువా పూలమాలలు వేసి ఆశీర్వాదించారు. రథోత్సవ ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు ఆధ్వర్యంలో కోసిగి సీఐ మంజునాథ్, ఎస్ఐ చంద్రమోహన్ భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నాయకులు ఎంపీపీ ఈరన్న, మండల కన్వీనర్ బెట్టన గౌడ, నాడుగేని నరసింహులు, నాడుగేని నాగరాజు, మహేష్ స్వామి, మంగమ్మ, భీమక్క, బుల్లి నరసింహులు, బండ్ల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ విస్తృత పర్యటన

ఆదోని టౌన్: ఆదోని పురపాలక కమిషనర్ కృష్ణ ఆదివారం పట్టణంలో విస్తృత పర్యటన చేపట్టారు. 19వ వార్డు కొత్తబస్టాండ్ రోడ్డు, ఎస్‌కేడీ కాలనీ, ఆర్‌టీసీ బస్టాండ్ ఏరియా, ఇంద్రానగర్, శక్తిగుడి ఏరియా, వెంకన్నపేట, ఏరియా 42వ వార్డు హనుమాన్ నగర్, కోట వీరభద్ర స్వామి గుడి ఏరియా, అరుణ్‌జ్యోతి నగర్, దుబ్బగణపతి ఏరియా తదితర ప్రాంతాల్లో పర్యటించారు. కాలవల్లో పూడికతీత పనులతో పాటు తడి, పొడి చెత్త సేకరణను పరిశీలించారు. ఆదోని మున్సిపల్ కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ అనుపమ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకొని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు.

జలజీవన్ మిషన్ అమలు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేసి గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ఎదుట సంఘం నాయకులు ధర్నా చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవి సమీపిస్తుండటంతో గ్రామాల్లో మంచినీటి ఎద్దడి తీవ్రం కానుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రజల దాహార్తిని తీర్చేందుకు జలజీవన్ మిషన్ పథకాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు బాలరాజు, బాబు, ఏఐకెఎంఎస్ నాయకులు పెద్దారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టండి

ఆదోని రూరల్: మండలంలోని కొత్తూరు గ్రామంలో సీసీరోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులను సగం చేసి వదిలేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని సీపీఐ మండల కార్యదర్శి కల్లుబావి రాజు అధ్యక్షులు కొత్తూరు గంగన్న ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి ఎల్లప్ప కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ తెలిపారు. రోడ్డు పనులు పూర్తి చేయాలని కోరుతూ సోమవారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ సగం సగం రోడ్డు వేయడంతో నీరు రహదారి మధ్యలో నిలిచి దుర్వాసన వెదజల్లుతుందన్నారు. కుక్కలు, దోమల బెడద ఎక్కువవై ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. సీపీఐ నాయకులు అస్లాం, దస్తగిరి, బాషా, మారెప్ప పాల్గొన్నారు.

ఇటుక బట్టీల యజమానులపై కేసు నమోదు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ఎమ్మిగనూరు పరిధిలో వ్యవసాయ భూముల్లో అక్రమంగా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులను నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు తిమ్మగురుడు, వీరేష్, నరసింహారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఏఐటీయూసీ పట్టణ నాయకులు విజేయేంద్ర అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వీరేష్, లోకేష్, మల్లికార్జున గౌడ్,మాలిక్, ఖాజ తదితరులు పాల్గొన్నారు.

20 రోజులుగా పనిచేయని ఏటీఎం



మూతపడ్డ ఎస్బీఐ ఏటీఎం

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలోని స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం 20రోజులుగా మూతపడే ఉందని సీపీఎం పార్టీ సీనియర్ నాయకుడు మల్లయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కౌతాళంలో బ్యాంక్ పక్కన ఉన్న ఏటీఎం అలంకారప్రాయంగా ఉందన్నారు. బ్యాంకులు ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు పనిచేస్తాయని, మిగిలిన సమయంలో అత్యవసర పరిస్థితుల్లో ఏదైనా డబ్బులు అవసరమైతే కష్టంగా మారిందన్నారు. ఏటీఎం 20 రోజుల నుంచి మూతపడ్డ బ్యాంకు సిబ్బంది పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై బ్యాంకు ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేల చూడాలని సీపీఎం డిమాండు చేస్తున్నట్లు తెలిపారు.

మిరప రైతులను ఆదుకోవాలి


ఆదోని తహసీల్దార్ రాముడుకు వినతి పత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు


ఎమ్మిగనూరు తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆదోని రూరల్: ఆర్థికంగా నష్టపోయిన మిరప రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఏపీ రైతు సంఘం మండల కార్యదర్శి అయప్ప అధ్యక్షతన మిరప రైతులు ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎకరాకు రూ. 2 లక్షలు పెట్టుబడులు పెట్టి మిరప పంట సాగు చేసిన రైతులకు కనీసం రూ. 50వేలు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. దిగుబడులు భారీగా తగ్గిపోయాయని, దీనికితోడు ధర కూడా సగానికి పడిపోయిందన్నారు. అనంతరం తహసీల్దార్ రాముడుకు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమలో రైతు సంఘం నాయకులు బాషా, తిక్కన్న, మునిస్వామి, అయ్యన్న డీవైఎఫ్ఐ నాయకులు ఉచ్చిరప్ప తదితరులు పాల్గొన్నారు.

నందవరం : కూటమి ప్రభుత్వం మిరప రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం(ఏపీకేఎస్) మండల అధ్యక్షుడు దేవపుత్ర డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. నాయకులు స్వామిదాసు, జయరాజు తదితరులు పాల్గొన్నారు.

మిరపకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఎమ్మిగనూరుటౌన్: రైతులు పండించిన మిరప పంటకు ప్రభుత్వం క్వింటానికి రూ.30వేల గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల అధ్యక్షులు అబ్దుల్లా, లక్ష్మీనర్సయ్య, సీపీఎం నాయకులు గోవిందులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేసి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ శేషఫణికి అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు రాముడు, సురేష్, రైతులు రమేష్, రామన్న, బజారి తదితరులు పాల్గొన్నారు.